క్లుప్తంగా

పారిజాతగిరిలో ప్రత్యేక పూజలు



శ్రీవేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతసేవ, తోమాలసేవ, ఆరాధన, తీర్థప్రసాద గోష్టి తదితర పూజలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. భక్తులకు బుట్టాయగూడెంకు చెందిన గద్దె సీతారామచంద్రరావు, గద్దె నాగ భూషణం జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. దాతలు రెడ్డి రంగప్రసాద్, వారి కుటుంబ సభ్యుల సహకారంతో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి మానికల రాంబాబు తెలిపారు. దాతలకు ఆలయ అర్చకులు స్వామివారి ఆశీస్సులు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించి, సత్కరించారు.

అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు



అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం అయ్యప్ప స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన స్వామివారి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ప్రగడవరంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్



ఉపాధిహామీ మేట్లకు పరిసరాల శుభ్రతపై అవగాహన కలిగిస్తున్న అధికారులు

చింతలపూడి: ప్రగడవరం గ్రామ పంచాయతీలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా సర్పంచ్ టి భూపతి ఆధ్వర్యంలో శనివారం రోడ్లు ఊడ్చి శుభ్రం చేశారు. డిప్యూటీ ఎంపీడీఓ కె రత్నకుమార్ మాట్లాడుతూ ప్రజలందరికీ తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన కలిగించారు. ఉపాధి హామీ మేట్ల వద్దకు వెళ్లి పరిసరాల శుభ్రతపై వివరించారు. ఇంటింటికీ క్లాప్ మిత్రాలు చెత్త రిక్షాతో వచ్చినప్పుడు సోమవారం నుంచి శుక్రవారం వరకు తడి చెత్త, అలాగే శనివారం పొడి చెత్త అందచేయాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు, సచివాలయం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కన్నాపురం వాసికి ఎన్టీఆర్ జీవిత విశిష్ట పురస్కారం



విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ టి.పార్థసారథిని సత్కరిస్తున్న దృశ్యం


కొయ్యలగూడెం: కన్నాపురం వాసి డాక్టర్ పార్థసారథికి ఎన్టీఆర్ పురస్కారం లభించింది. శనివారం విజయవాడలో పాన్‌ఇండియా, ఫిలింత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మశ్రీ స్వర్గీయ ఎన్టీఆర్ సినీవజ్రోత్సవ వేడుకల్లో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ (రిటైర్డ్ డీవైఈఓ) చేతులమీదుగా డాక్టర్ టి.పార్థసారథిని సత్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళాకారులకు, తెలుగు సాహిత్యానికి విశేష కృషి చేసిన వ్యక్తులకు సంస్థ ఆధ్వర్యంలో సన్మానించారని, ఈ నేపథ్యంలో తనకి ఎన్టీఆర్ విశిష్ట జీవిత పురస్కారం ప్రదానం చేసి సత్కరించినట్లు పార్థసారథి తెలిపారు.

12 నుంచి విజయదుర్గమ్మకు పూజలు

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయదుర్గమ్మ ఆలయంలో ఈనెల 12, 15, 25 తేదీల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పౌర్ణమి తిథిని పురస్కరించుకుని ఈ నెల 12న సాయంత్రం అమ్మవారికి పల్లకీసేవ, 15న మూలా నక్షత్రం సందర్భంగా 30వ చండీహోమం, రాత్రి 8 గంటలకు అన్నసమారాధన, 25వ తేదీన సాయంత్రం 7 గంటలకు మాసశివరాత్రి పురస్కరించుకుని శివ పార్వతుల పంచలోహ ఉత్సవ విగ్రహాలకు పల్లకీ నిర్వహించడం జరుగుతుందని, భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు.

పోగొండ.. లక్ష్యం నెరవేరకుండా..

- అసంపూర్తిగా మిగిలిపోయిన పంట కాల్వల పనులు
- ప్రస్తుతం 153.4 మీటర్ల మట్టంలో పుష్కలంగా నీరు
- నీరు పూర్తిస్థాయిలో ఉన్నా నెరవేరని సాగు లక్ష్యం



మండు వేసవిలో నిండుకుండలా ఉన్న పోగొండ



వేసవిలో బైనేరు వాగు నిండుగా ఉన్న దృశ్యం

బుట్టాయగూడెం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో చిన్న, సన్నకారు రైతుల కోసం నిర్మించిన పోగొండ రిజర్వాయర్ లక్ష్యం నెరవేరడం లేదు. వైఎస్సార్ మరణానంతరం పంట కాల్వల పనులు అసంపూర్తిగా వదిలేయడంతో ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో రైతులకు ఉపయోగడడం లేదు. మండు వేసవిలో సైతం రిజర్వాయర్‌లో నీరు పుష్కలంగా ఉన్నా వేల ఎకరాల సాగుకు అందడం లేదు.

7,600 ఎకరాలు సాగు లక్ష్యమైనా..

గిరిజన ప్రాతంలోని గిరిజన గ్రామాల్లో సుమారు 4 వేల ఎకరాల బీడు భూములకు, కొయ్యలగూడెం మండంలోని 3,600 ఎకరాల పంటలకు సాగు నీరు అందించే లక్ష్యంగా దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి పోగొండ రిజర్వాయర్ ప్రాజెక్టును నిర్మించారు. మహానేత వైఎస్సార్ అకాల మరణం తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో పంట కాల్వల పనులు పూర్తిచేయకపోవడంతో ఆ పనులు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో లక్ష్యానికి అనుగుణంగా వేల ఎకరాలకు సాగునీరు అందడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది 1,500 ఎకరాలకు మాత్రమే నీరు విడుదల

ఈ ఏడాది రబీ సీజ‌న్‌కు సంబంధించి సుమారు 1,500 ఎకరాలకు అధికారులు సాగునీరు విడుదల చేశారు. బుట్టాయగూడెం మండలం నిమ్మలగూడెం, పాలకుంట, అచ్చియ్యపాలెం, కంద్రకగూడెం, పద్మవారిగూడెం, కుమ్మరికుంట తదితర గ్రామాల పరిధిలోని రైతులు వర్జీనీయా పొగాకు, మొక్కజొన్న పంటలు పండిస్తున్నారు. అత్యధికంగా ఈ ప్రాంతంలో మొక్కజొన్న పంటలను వేయడం జరిగింది. అయితే మండు వేసవిలో కూడా పోగొండ రిజర్వాయర్‌లో నీరు పుష్కలంగా ఉంది. ప్రస్తుతం 153.4 మీటర్ల మంటంలో నీరు ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఈ పొంగొండ రిజర్వాయర్ ద్వారా వస్తున్న నీటితో బైనేరు వాగులో కూడా వేసవిలో నీరు పుష్కలంగా ఉన్నాయి. పోగొండ రిజర్వాయర్, బైనేరువాగులో నీరు పుష్కలంగా ఉండడంతో మూగజీవాలకు కూడా ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. పరిసర ప్రాంతంలోని పశువులు రిజర్వాయర్, బైనేరు వాగులో నీటిని తాగి దాహార్తిని తీర్చుకుంటున్నాయి. అసంపూర్తిగా ఉన్న పంట కాల్వల పనులు పూర్తి చేసి వేల ఎకరాలు సాగులోకి వస్తాయని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పూర్తిస్థాయిలో జలాశయంలో నీరు



పోగొండ రిజర్వాయర్ నుంచి ఈ ఏడాది పంటల సాగు కోసం రబీలో సుమారు 1500 ఎకరాలకు నీటిని విడుదల చేశాం. ప్రస్తుతం పోగొండ రిజర్వాయర్‌లో 153.4 మీటర్ల మట్టంలో నీరు పుష్కలంగా ఉంది. పంట కాల్వ పనులు పూర్తి కావాల్సి ఉన్నందున పూర్తిస్థాయిలో నీరు విడుదల చేయకపోవడంతో జలాశయంలో నీరు ఉంది.

– టి. సురేష్, ఇరిగేషన్ ఏఈఈ, కేఆర్‌పురం, బుట్టాయగూడెం మండలం

పంచాయతీ తాగు నీటి వృథా



డ్రెయినేజీలోకి వృథాగా పోతున్న పంచాయతీ తాగునీరు

కొయ్యలగూడెం: కూటమి నాయకుల విభేదాల వలన పంచాయతీ తాగునీరు వృథాగా పోతుండడంతో ప్రజలు దాహార్తితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బయ్యన్నగూడెం పంచాయతీ ఆధ్వర్యంలో 2016వ సంవత్సరంలో తాగునీటి బోరు రూ.రెండున్నర లక్షలతో నిర్మించారు. అప్పటినుంచి బోరుకు మోటార్‌ను అమర్చక పోవడం వల్ల వృథాగా పడి ఉండగా కొన్ని వార్డుల్లో తాగునీటి సమస్య ఏర్పడింది. దీంతో పంచాయతీ ఇటీవల కొత్త మోటర్‌ను అమర్చారు. తాగునీటి బోరు నుంచి పైపులైన్లు ఏర్పాటు చేసి వాటర్ ట్యాంకుకు అనుసంధానం చేయాల్సి ఉండగా కూటమి నాయకుల మధ్య విభేదాలు బయటపడ్డాయి. దీంతో ఒకరికి కొకరు భేషజాలకు పోయి తాగునీటి బోరును అనుసంధానం చేయకుండానే వదిలివేశారు. అసలే వేసవి, ఆపై దాహార్తితో కొన్ని వార్డుల ప్రజలు పడుతున్న బాధలు ఇవేమీ వారికి పట్టలేదు. దాంతో బోరు నుంచి వస్తున్న నీరు వృథాగానే డ్రెయినేజీలో కలసి పోతుంది. నాయకులు విభేదాలు మాట ఎలా ఉన్నా కనీసం అధికారులు చిత్తశుద్ధితో కృషిచేసి బోరు నీరును ట్యాంకుకు అనుసంధానం చేసి సమస్యను తీర్చాలని పలు వార్డులకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు



కోర్టు హాల్‌లో కార్మిక చట్టాలపై అవగాహన కలిగిస్తున్న జడ్జి మధుబాబు

చింతలపూడి: కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు అన్నారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక కోర్టు హాల్‌లో ఆటో యూనియన్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక చట్టాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో జడ్జి మధుబాబు మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులు ఇ– శ్రమ్ పోర్టల్‌లో తప్పనిసరిగా పేరు నమోదు చేయించుకోవాలన్నారు. ఆర్థిక స్తోమత లేని వారు మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునన్నారు. డ్రైవర్లు తప్పకుండా లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని హెచ్చరించారు. సంతానం నుంచి నిరాదరణకు గురైన వృద్ధులు ఆర్డీవో వద్ద అర్జీ చేసుకుంటే పిల్లల నుంచి భరణం పొందవచ్చునన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రయాణం చేస్తే జరిమానా విధించి కేసులు పెట్టడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు చేకూరి వెంకటరమణారావు, కోర్టు సూపరింటెండెంట్ పీజీ నాయుడు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం



బెల్లపు ఊటను గుర్తించిన రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులు

కొయ్యలగూడెం: నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ కె.వీరబ్రహ్మం శనివారం పేర్కొన్నారు. మంగపతిదేవిపేట సమీపంలోని ఓ రైతుకు చెందిన పొలంలో 200 లీటర్లు కలిగిన డ్రమ్ములను గుర్తించి మొత్తం 400 లీటర్ల బెల్లపు ఊట రెవెన్యూ అధికారుల సమక్షంలో ధ్వంసం చేసినట్లు తెలిపారు. వ్యవసాయ పొలానికి సంబంధించిన రైతును విచారించగా భూమిని కౌలు కు ఇచ్చినట్లు తెలిపారన్నారు. మంగమతిదేవిపేట పరిసర ప్రాంతంలో నాటు సారా తయారీ ఎక్కువగా ఉందని ప్రజలు ఆరోపణలు చేశారని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న కట్టా ముత్యాలరావు

వేలేరుపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి పోరాటాల ద్వారా కార్మికులు తమ హక్కులను సాధించుకోవాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు పిలుపునిచ్చారు. మేడే వారోత్సవాల్లో భాగంగా మేడేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పార్టీ జెండా దిమ్మను శనివారం ఆవిష్కరించారు. పార్టీ మండల కార్యదర్శి కట్టం రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ డివిజన్ కార్యదర్శి కట్టా ముత్యాలరావు, జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డల ముత్యాలరావు మాట్లాడారు. దేశంలో నేటికీ వలస కార్మికులు, వ్యవసాయ కూలీలు, పేద రైతులు దోపిడీకి గురవుతున్నారని, పాలకవర్గాలు ప్రజలను పట్టించుకోవటం లేదన్నారు. ఎన్నికల్లో గెలిచిన పార్టీలు అనేక హామీలు ఇచ్చి సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించి ఒక్కటి అమలు చేయలేదని విమర్శించారు. కార్మికులంతా ఏకమై ఈ దోపిడి వ్యవస్థను కూల్చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కెరటం వీరాస్వామి, మేడేపల్లి ఎంపీటీసీ తుర్రం తమ్మయ్య, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా తిరు నక్షత్ర జయంతి వేడుకలు



జీలుగుమిల్లిలో నగర సంకీర్తన చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: దైవ దర్శనంలో కుల, మత, వర్గ భేదాలు లేకుండా ఒక విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చిన వ్యక్తి రామానుజులు అని పల్లం రవికుమార్, నేలటూరి సత్యనారాయణ అన్నారు. జీలుగుమిల్లిలో దాసు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రామానుజుల వారి తిరు నక్షత్ర జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేవుడు, ప్రపంచం వేరుకాదని, సమాజంలో అణగారిన వర్గాలకు గుడి దర్శనాలు చేయించిన ఘనత రామానుజులకే దక్కుతుందని అన్నారు. సమతా మూర్తి శ్రీ రామానుజుల వారి జీవితం మనందరికీ ఆదర్శం కావాలని కోరారు. ఈ పూజా కార్యక్రమం అనంతరం నగర సంకీర్తన చేస్తూ రామన్నపాలెం రామాలయాన్ని, అభయాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదె

పోలవరం రూరల్: ప్రగడపల్లి గ్రామానికి చెందిన రైతు చాపర్ల వెంకటాచలానికి చెందిన పాడి గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గత రెండు రోజులుగా వీస్తున్న ఈదురుగాలులు, భారీ వర్షాలకు పొలాల్లో ఉన్న తాటి చెట్టు విరిగి పడింది. విద్యుత్ వైర్లు కూడా తెగిపడిపోయాయి. మేత కోసం వెళ్లిన గేదె ప్రమాదవశాత్తు తీగలకు తగిలి మృతిచెందింది. పొలానికి వెళ్లిన రైతుకు విద్యుత్ వైర్లు తెగిపడి ఉండటంతో విద్యుదాఘాతానికి గురైనట్లు గుర్తించి, పశుసంవర్ధక శాఖ, విద్యుత్ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు.

ఎన్టీఆర్ జిల్లాకు తరలివెళ్లిన శ్రీవారి ధర్మప్రచార రథం



ధర్మప్రచార రథ పర్యటనను ప్రారంభిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ధర్మప్రచార రథం శనివారం సాయంత్రం ఎన్టీఆర్ జిల్లా, రెడ్డిగూడెం మండలం, రాఘవాపురంనకు తరలివెళ్లింది. తొలుత ఆలయ జంటగోపురాల వద్ద ప్రారంభమైన ఈ రథం లక్ష్మీపురంలోని సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వర స్వామివారి ఆలయం వద్దకు చేరుకుంది. అక్కడ ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, అర్చకులు కొబ్బరికాయలు కొట్టి, రథ పర్యటనను ప్రారంభించారు. ఆదివారం ఉదయం రెడ్డిగూడెంలో శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్టు దుర్గాప్రసాద్ తెలిపారు. ఆ తరువాత తిరిగి ప్రచార రథం క్షేత్రానికి చేరుకుంటుందని చెప్పారు.

పచ్చిరొట్ట ఎరువులతో ఎన్నో ప్రయోజనాలు



రైతును సత్కరించి, పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్న డీపీఎం వెంకటేష్

ద్వారకాతిరుమల: పచ్చిరొట్ట ఎరువులు భూసారాన్ని పెంచడమే కాకుండా, అధిక దిగుబడులు రావడానికి, తెగుళ్ల నివారణకు ఎంతగానో ఉపయోగపడతాయని ఏలూరు జిల్లా అధికారి డీపీఎం వెంకటేష్ అన్నారు. మండలంలోని ఎం.నాగులపల్లి గ్రామంలో శనివారం వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ విభాగం వారు పచ్చిరొట్ట ఎరువుల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. అందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీపీఎం వెంకటేష్, ఎన్‌పీఎం, ఎంటీ గోపాలకృష్ణమూర్తి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంటీ నిర్మల, డీఎంఎం టీ వెంకటలక్ష్మి, మండల ఇన్‌చార్జి సుబ్బారావు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

మూగజీవాల పట్ల ఔదార్యం



జి.కొత్తపల్లిలో తొట్టి వద్ద నీటిని తాగుతున్న వానరాలు

ద్వారకాతిరుమల: మండలంలోని జి.కొత్తపల్లి అటవీ ప్రాంతంలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు కొందరు దాతలు వాటికి మంచినీటిని అందిస్తున్నారు. జి.కొత్తపల్లి–దూబచర్ల రహదారి పక్కనున్న నీటి తొట్టెలను వాటర్ ట్యాంకర్ ద్వారా నింపుతున్నారు. వేసవి కారణంగా వానరాలు ఆ నీటిని ఎగబడి మరీ తాగుతున్నాయి. ఈ క్రమంలోనే శనివారం లక్ష్మీనారాయణ ఫౌండేషన్ వారు తాగునీటితో పాటు, వాటికి అరటి పండ్లను అందజేశారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న రత్న ప్రసాద్

పెదవేగి : నేటి సమాజంలో బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు శనివారం పెదవేగి మండలం వంగూరు గ్రామంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలపైన గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిరోధానికి సమిష్టిగా కృషి చేయాలన్నారు. పిల్లలను తప్పనిసరిగా ఉన్నత చదువులు చదివించాలని, అప్పుడే వారు అభివృద్ధిలో పయనిస్తారని అన్నారు. కార్మికులకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ టోల్ ఫ్రీ నెంబరు 15100 కు ఫోను చేసి తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది పి.రత్నరాజు, ప్యానల్ న్యాయవాదులు పి.వెంకటేశ్వరరావు, జీవీ భాస్కర్, గ్రామ సర్పంచి రూత్ మేరీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో...

జంగారెడ్డిగూడెం: పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి శనివారం మద్ది అంజన్నను దర్శించుకున్నారు. అనంతరం గుర్వాయిగూడెంలో మద్ది ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: తిమ్మాపురంలో పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 2,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

ఐకమత్యంతో ముందుకు సాగాలి

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజలు ఐక్యమత్యంతో రాజ్యాధికారం సాధించాలని ఫారెస్టు బోర్డు మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక ఏలూరు కొత్త రోడ్డులోని నవసమాజ్ సొసైటీ కార్యాలయంలో శనివారం దళిత బహుజన నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. పల్లెం ప్రసాద్, నవసమాజ్ సొసైటీ చైర్మన్ నేతల రమేష్ బాబు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు మహాత్మా పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానంతో రాజ్యాధికారం సాధించే దిశగా అడుగులు వేయాలని కోరారు.

ఏఐ, డేటా ఎనలిస్ట్ రంగాల్లో ఉద్యోగావకాశాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాబోయే కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా ఎనలిస్ట్ రంగాల్లో అనేక ఉద్యోగావకాశాలు ఉంటాయని, వాటిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని మైక్రోసాఫ్ట్ ప్రిన్సిపల్ ఇంజినీరింగ్ మేనేజర్ నల్లాని చక్రవర్తుల రాజేష్ కుమార్ సూచించారు. శనివారం స్థానిక సీఆర్‌ఆర్ పీజీ కళాశాలను రాజేష్ కుమార్ సందర్శించారు. పీజీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు రాబోయే జూన్, జూలై నెలలో క్యాంపస్ ప్లేస్మెంట్స్ నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తొలుత పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, డైరెక్టర్ వీఆర్ఎస్ బాబు యలమర్తి తదితరులు రాజేష్ కుమార్‌కు సాదర స్వాగతం పలికారు. అనంతరం రాజేష్ కుమార్ కళాశాల యాజమాన్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంబీఏ లెక్చరర్స్ తేర రాజేష్, స్ఫూర్తి, ఎన్‌జీఓ మోహిద్దీన్ బాషత తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి నుంచే సృజనాత్మకతపై దృష్టి పెట్టాలి



తాము తయారు చేసిన పేపర్ క్రాఫ్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు చిన్ననాటి నుంచే సృజనాత్మకతపై దృష్టి సారించాలని సీనియర్ రిసోర్స్‌పర్సన్ డీ. శ్రీవల్లి సూచించారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా ఆమె విద్యార్థులకు యోగా, పేపర్ క్రాఫ్టులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేపర్ క్రాఫ్ట్‌తో అనేక ఆకృతులు తయారు చేయవచ్చని, వాటిని గృహాల అలంకరణకు వినియోగించుకోవచ్చన్నారు. అలాగే యోగాతో మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యం పెరుగుతుందన్నారు. అనంతరం బీవీఎస్ లక్ష్మి విద్యార్థులతో కథలు చెప్పించడం, చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా నీతి కథలు చదివించారు. డ్రాయింగ్ టీచర్ పి. శంకర విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణ రావు, ఎండీ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

సంగీతం, నృత్యం తెలుగు వారి ఆస్తులు



కూచిపూడి నాట్యరత్న పసుమర్తి శ్రీనివాస శర్మను సన్మానిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సంగీతం, నృత్యం తెలుగు ప్రజల ఆస్తులని అవనిగడ్డ ఎమ్మెల్యే మండల బుద్ధ ప్రసాద్ అన్నారు. నగరానికి చెందిన కళాదీపిక నృత్య అకాడమీ ఆధ్వర్యంలో సంగీత నృత్యోత్సవాలు స్థానిక వైఎంహెచ్ఏ హాలులో శనివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ కళా దీపిక నృత్య అకాడమీ నిర్వాహకురాలు నాట్యాచారిణి ఎ.పార్వతీ రామచంద్రన్, కళారత్న కేవీ సత్యనారాయణ ఏలూరు నగరానికి కూచిపూడి నృత్యంతో ప్రపంచ ఖ్యాతిని తీసుకొచ్చారన్నారు. వారు నృత్య సంగీత రంగాల్లో చేసిన విశేష కృషిని అభినందించారు. తొలుత త్యాగరాజ స్వామి జయంతి సందర్భంగా కళావేదికపై స్థానిక సంగీత కళాకారులు ఆలపించిన త్యాగరాజ పంచరత్న సేవ సంగీత మహోత్సవంలో ఆలపించిన గీతాలు ప్రేక్షకులను అలరించాయి. అనంతరం అకాడమీ విద్యార్థులు త్యాగరాజ స్వామి కీర్తనలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కూచిపూడి నాట్యరత్న పసుమర్తి శ్రీనివాస శర్మను సంస్థ పక్షాన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళారత్న కేవీ సత్యనారాయణ, వేణుగోపాల్ లునాని, దువ్వి హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆరోపించారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా విస్తృత సమావేశం ఏలూరు అన్నే వెంకటేశ్వరరావు భవనంలో శనివారం సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ మే 20న ఒక రోజు దేశవ్యాప్తంగా ఉపాధి హామీ పనులు నిలిపేసి మండల కేంద్రాలు, గ్రామ సచివాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు.